

# విగ్రహవిధ్వంసం

చారిత్రిక గాథ

జమ్మి సుశీలారాణి

ఆ సూర్యాస్తమయ వేళ సోమనాథుని రమణీయ దేవాలయం వింతవింత అందాలతో వెలిగిపోయింది. తెల్లని గోడలపైన అస్తమయసూర్యుని అరుణ కిరణాలుపడి బంగారుపూత పూసినట్లు తళతళలాడాయి. పర్వతప్రాంతాలలో చల్లనినీడనిచ్చే పెద్దపెద్ద వృక్షాలూ, నురుగులుకక్కే కెరటాలతో తళతళలాడే సముద్రపు నీలిరంగునీళ్లూ, తెల్లని చలువరాతి మెట్లశ్రేణులూ సోమనాథుని ఆలయ సహజశోభను ద్విగుణీకృతం చేసివేశాయి. ఆ అపూర్వ సౌందర్యాన్ని చూస్తూ ముగ్ధులయిపోయే యాత్రికులుమటుకు ఆ సాయంకాలసమయంలో అక్కడ కనబడ లేదు ఆ సమయంలో ఆదేవాలయ ఆవరణలో సమావేశమయిన వారందరి ముఖాలలోనూ దైన్యభావమే వెయ్యివిధాల ప్రస్ఫుటమయింది. అక్కడ చేరిఉన్న వారిలో సగం మంది దేవాలయఅర్చకులూ, అధికారులూను. మిగిలినవారు ఊరిలోప్రజలు. వారంతా కూడా భీతదృక్కులతోనే నలువైపులా చూస్తూ మధ్యమధ్య తలలు వంచుకొని నిట్టూర్పులు విడుస్తున్నారు వారిలో అతివృద్ధుడైన అర్చకుడు ఒకాయన మటుకు నిబ్బరమైన మనస్సుతో, ధైర్యం పురికొల్పుతూ ప్రసంగించసాగాడు.

"నామటుకు నాకేమీ భయం కలగటం లేదు సుమా! ఆఫ్ఘన్‌స్తాన్‌నుంచి క్రూరహృదయుడైన మహమ్మదు పెద్ద సేనావాహినితో దక్షిణాపథానికి పురోగమిస్తే పురోగమించుగాక అంతపెద్దసైన్యాన్ని సింధు ఎడారిలో నుంచి తీసుకురావటం నిజంగా మూర్ఖ కార్యమేనని నా అభిప్రాయం"

ఇల్లా అంటూనే అక్కడ వున్న వారందరి కేసీ ఒకసారి చురుకుచూపులతో చూశాడు ఆ వృద్ధుడు. కాని వారెవ్వరికీ ఆ వాక్యాలతో కాస్తయినా ధైర్యం కలిగినట్లు స్ఫురించలేదు ఆయనకు. పూర్వంలాగే వారంతా తలలువంచుకొని నేలవంకేచూస్తూ కూర్చున్నారు వారికి ధైర్యం కలిగించేందుకు వృద్ధుడు మరోవాక్యం పలుకబోయాడు. ఆసమయానికి సరిగ్గా ఒక వార్తాహరుడు త్వరత్వరగా అక్కడికి గుఱ్ఱంమీదవచ్చి గుఱ్ఱందిగి దానిని దేవాలయం ఎదుటవున్న వటవృక్షానికి కట్టివేసి వారిదగ్గరకు వచ్చాడు.

# విగ్రహావిధ్వంసం

సభ్యులంతా ఆత్రంగా అతనివైపే ఏమివార్త చెబుతాడోనని చూస్తూ ఉండిపోయారు. వృద్ధ అర్చకుడుకూడా మునివేళ్లతో తెల్లని గడ్డంలోని పండుశిరోజాలను దువ్వుకొని ఆ రౌతుకేసి చూశాడు. రాజధానీ నగరం నుంచి ఎక్కడా ఆగకుండా నిరంతర ప్రయాణంచేసివచ్చిన ఆ రౌతు ఒకక్షణం విశ్రాంతి తీసుకొని అలసట తీరగానే వారందరితో వివరంగా పరిస్థితులన్నీ చెప్పసాగాడు.

“ప్రభుత్వమంతా శత్రువు నెదుర్కొనే సన్నాహాలలో వుంది. మహారాజుకూడా పెద్దసైన్యాన్ని సమకూర్చుకున్నారు. రాజ్యంలోని స్త్రీలంతా తమ నగలూ, బంగారు ఆభరణాలనూ అన్నిటినీ కరిగించివేసి దేశంలోవున్న రాజులకూ సైనికులకూ ధనసహాయం చేస్తున్నారు ”

మధ్యలో కొద్దిసేపు అతను ఆగాడు. కొద్దిసేపు నిశ్శబ్దం అక్కడ వ్యాపించింది. అక్కడ చేరినవారి మనస్సులోని భయాతిశయం వలెనే నల్లనల్లని చీకట్లు ఆ ప్రదేశమంతటా చుట్టివేశాయి. ఆ చీకటిలో పర్వతపంక్తులూ, వృక్షసమూహాలూ వికృత రూపాలుధరించిన పిశాచాలలాగ వారి మనస్సుల్లో దిగులుకొలిపాయి. ఆ రౌతు తిరిగి మంద స్వరంతో ప్రసంగించసాగాడు.

“మహమ్మదు శ్రీ సోమనాధ దేవాలయాన్ని దోచుకుతీరతానని గట్టిప్రతిజ్ఞ చేశాడనే నీలివార్త బలంగా సర్వత్రా వ్యాపించి ఉన్నట్లు ప్రభుత్వానికి తెలియవచ్చింది ఈ పవిత్ర దేవాలయంలో గొప్ప సంపద దాచిపెట్టబడి వుందని అతను విన్నాడట.”


ఇది వింటూనే వృద్ధ అర్చకుడు ఒకమారు కంపించిపోయాడు. కాని మరునిమిషమే తనను తాను సంబాళించుకున్నాడు. ఆ వార్తాహరుని ప్రక్కనే ఆసీనుడయి ఉన్న యాత్రికుడొకడు సంభాషణలోకి వస్తూ “మహమ్మదు మునుపే అపార భాగ్యవంతుడని విన్నాను. అతని వేటకుక్కల మెడలకు సుమారు నాలుగైదు వందల సువర్ణ నాణకాల విలువచేసే పట్టెడలు, అవి ధరించటానికి ముత్యాలూ, వజ్రాలూ పొదిగిన దుస్తులూ వుంటాయనికూడా చెప్పుకునేవారు అంతా,” అన్నాడు.

చుట్టుపక్కలవారిలో ఒకరిద్దరు ఆవార్తకు విస్తుపోయి అతనికేసి చూశారు. “మహమ్మదు ధనవంతుడవనీ, పేదవాడవనీ. శ్రీ సోమనాధుని దోచుకునే విషయంలో మటుకు ఆమ్లేచ్ఛుడు ఎన్నటికీ విజయ్వా పొందలేడు. ఆ పరమేశ్వరుని మహిమ అద్వితీయమైనది” అంటూ వృద్ధుడు శ్రీ సోమనాధుని వైపు ఒకసారి తిరిగి నమస్కరించాడు. ఆయన ముఖంలో భక్తిభావం పొంగి పొర్లిపోయింది మరోసారి ఆయన ఆవార్తాహరునివైపు తిరిగి, నమ్మకలేని స్వరంతో” ఆమ్లేచ్ఛరాజు తన అపార సేనావాహిని నంతనూ సింధుఎడారిని దాటించి ఎట్లా సురక్షితంగా తీసుకురాగలడు?” అని ప్రశ్నించాడు.

“ఎలా తీసుకొనివస్తాడో ఎవరెరుగుదురు? దారిలో చాలామంది విపరీతమైన దాహంతో మరణించారనీ, కొందరు ఆ భయంకరమైన ఉష్ణాధిక్యానికి ఉన్మాదులయిపోయారనీ తెలిసింది. కాని అందువలన మహమ్మదుకేమీ లోటుకలగదు. అతనిసేన అపారమైనది.” వార్తాహరుని యీ జవాబుతో సభ్యులలో లేశమాత్రంగానైనా ఉండే ధైర్యం కాస్తా హరించిపోయింది. చిక్కని చీకట్లు వారి మనసుల్నీ, పరిసరాల్నీ ముంచెత్తివేశాయి క్రమక్రమంగా విషణ్ణవదనాలతో అర్చకులంతా సోమనాధుని సంధ్యార్చనకోసం లేచి వెళ్లిపోయారు. ప్రజలుకూడా నెమ్మదినెమ్మదిగా సాగిపోయారు. చివరకు వృద్ధ అర్చకుడొక్కడే ఆ చీకటిలో నిలిచి ఒక వేడి నిట్టూర్పు విడిచివేసి “సోమనాధుడు తన సుందర దేవాలయ వినాశానికి ఓర్చడు” అని తలపోస్తూ త్వరత్వరగా గర్భగుడిలోకి వెళ్లిపోయాడు. ఆ తరువాత గుడిలోనుంచి పవిత్రమంత్రాలు కర్ణపేయంగా వినవచ్చాయి.

## 2

వృద్ధఅర్చకునివలె ధైర్యంతో ఉండలేని దేవాలయ తదితరాధికారులు, సేవకులు దేవాలయ రక్షణకి తగినయేర్పాట్లు చేసుకోవటంలో నిమగ్నులయిపోయారు. గోడలు, ప్రాకారాలూ అవీ బలిష్ఠమైనవే. అయినప్పటికీ వారిలో భీతిమటుకు పోవటంలేదు. మహమ్మదు తన దండయాత్రలో గ్రామాలనూ, నగరాలనూ, పల్లెలనూ దోచుకుంటూ వేలాది ప్రజలను వధిస్తూ విజయోత్సాహంతో క్రమముగా ముందుకుసాగిపోతున్నాడనే వార్తలు ఎప్పటికప్పుడు వారికి తెలియవస్తూనే ఉన్నాయి. మహమ్మదు తన చేతికందినంత సంపదనూ భాగ్యాన్నీ మోసుకుపోతున్నాడు. అతన్ని ఎదుర్కొవటానికి వచ్చేజనం మరుక్షణమే వెనుదిరిగి ప్రాణాలపైతీపికొద్దీ పిక్కబలంచూపి పారిపోతున్నారు. వృద్ధపూజారి యీదారుణవార్తలనువింటూనే గజగజ వణికిపోయాడు. వెనువెంటనే శ్రీ సోమనాధుని దివ్యమంగళవిగ్రహాన్ని మనస్సులోధ్యానించి మనశ్శాంతిపొందటానికి ప్రయత్నించాడు.



ఆరోజు సోమనాథునికి యథావిధిగా పూజాదికాలు నెరవేరుస్తున్న వృద్ధఅర్చకుని కర్ణాలకు దేవాలయ ఆవరణలో ప్రజల గడబిడ ధ్వనులు వినవచ్చాయి. ఆయనగాత్రం కంపించటంతో ఉద్ధరిణెతో చేతిలోనికి తీసుకున్న అర్ఘ్యజలాలు అల్లాగే నేలమీద ఒలికిపోయాయి. ఈ విపరీతకార్యానికి ఆయన మనస్సు కల్లోలంతో సంక్షుభితమయిపోయింది. మరుక్షణమే ఆయన పూజ నిలిపి సంగతి తెలుసుకోవటానికి గర్భగుడిలోనుంచి బయటకు వచ్చాడు. పర్వతప్రాంతాలలో నివసించే ఆయనమిత్రుడు ఒకాయన రొప్పుతుంటూ సందర్భాలను వివరిస్తున్నాడు.

"సర్వమూ నాశనమయిపోయే సమయం దాపురించింది. రాజధానీనగరాన్ని శత్రువులు ముట్టడించివేశారు. ఇంచుమించు వారు విజయంపొందినట్లే. దేవాలయం దోపిడీకోసం ఆ మ్లేచ్ఛుడు ముందుకుచొచ్చుకుని వచ్చివేస్తున్నాడు."

ఈమాటలను చెబుతూనే ఆయన వణికిపోసాగాడు. అక్కడ మూగిఉన్న జనం కొయ్యబారిపోయారు. వృద్ధఅర్చకుని రెండు నేత్రాలలోనుంచీ బాష్పాలు జలజలా కురిసి తెల్లనిగడ్డంలో చిక్కుపడిపోయాయి. "ప్రభూ! సోమనాథా! దీనబంధూ! సర్వరక్షకుడవు. నిన్ను నీవు రక్షించుకోలేవా తండ్రీ! అన్నిటికీ నీవేఉన్నావు" అంటూనే శ్రీ సోమనాథుని విగ్రహాన్ని తన వేడికన్నీళ్లతో అభిషేకించివేశాడు వృద్ధుడు.

## 3

కాని ఒకరోజు పూర్తిగా గడవలేదు. శత్రుసైన్యంవచ్చి ఆ పవిత్ర దేవాలయాన్ని చుట్టుముట్టివేసింది. ఆ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలూ, దేవాలయ అర్చకులూ కూడా తమ భగవంతుణ్ణి కాపాడుకోవటానికి ధైర్యసాహసాలతో శత్రువులను ఎదిరించివేశారు.

"స్వామి అపార మహిమోపేతుడు. ఆయన తన దేవాలయాన్ని ముట్టడించబోయే ప్రతివిరోధిని ఓడించివేస్తాడు. తన భక్తులను తప్పక రక్షిస్తాడు" అంటూ అర్చకులు ఎలుగెత్తి చాటుతూ ప్రజలను ఉత్సాహపూరితుల్ని చేయసాగారు. దేశంలోని రాజులూ, సామంతరాజులూ అంతా తమతమ సైన్యాలతో దేవాలయరక్షణకి వచ్చివేశారు. రెండు అహోరాత్రాలు వారంతా దుర్భేద్యమైన ఆలయ ప్రాకారాల వెనకనుంచి బలంగా పోరాడారు. మూడవరోజు పరిస్థితుల్ని గమనించిన మహమ్మద్ యించుమించు తను ఓడిపోతున్నానని అనుకోసాగాడు. హిందూ సైనికులు దేవాలయంచుట్టూ నిలిచి తీవ్రంగా శత్రుసైనికులతో పోరసాగారు. మహమ్మదు సైన్యం వారిని తొలగించుకొని ఆలయప్రవేశం చేయటానికి ఏమాత్రమూ సందు లేకుండా కట్టుదిట్టంగా నిలిచిన హిందూసైనికులను చూశాడు మహమ్మదు. అట్లా చూస్తూనే చటుక్కున గుఱ్ఱందిగి నేలమీద మోకాళ్ళమీద నిలచి గొంతెత్తి అల్లాను ప్రార్థించసాగాడు.

ఆయన వింతప్రవర్తనను చూస్తూ మొదట యవన సైనికులు విస్తుపోయారు. మరుక్షణమే వారికి తమరాజువేసిన ఎత్తు తెలియవచ్చింది. దానితో వారుకూడా నేలకుదూకి ఆయనను అనుకరించసాగారు. ఈ విధంగా వారంతా ప్రార్థిస్తున్నట్లుగా నటిస్తూనే మోకాళ్ళమీద పాకి ముందుకు సాగిపోయారు. చివరకు దేవాలయ ద్వారాలవద్దకు చేరుకొని హఠాత్తుగా లేచి నిలువబడి ద్వారాలను రక్షిస్తున్న హిందువులను మెరపులా పడకొట్టివేసి, వారిచేత తిరిగి దెబ్బలు తినకుండానే ఒక పెద్ద ప్రవాహంలాగా ముందుకు ఆలయంలోకి తోసుకపోయారు. "ఖుదాహై! ఖుదాహై! (భగవంతుడున్నాడు') అనే నినాదాలు దేవాలయ ప్రాంగణమంతటా నిండిపోయి హిందూ సైనికుల హృదయాలలో దారుణ శిలాపాతం కలుగచేశాయి.

## 4

గర్భగుడిలో శ్రీ సోమనాథుని పవిత్రమూర్తికి ఎదురుగా నిలిచి వృద్ధార్చకుడు నిలువెల్లా వణికిపోతూ భగవంతుని అనేకవిధాల ప్రార్థించసాగాడు. మిగిలిన అర్చకులంతా ఆయన చుట్టూ మూగి తమ దేవుణ్ణి యీ అంత్యక్షణాలలో రక్షించుకునేందుకు ఉపాయాలు అన్వేషించసాగారు. ఆ క్షణానే మహామ్మదు పెద్దపెద్దఅంగలు వేస్తూ ఠీవిగా వారిముందుకు వచ్చి నిలిచాడు.

వృద్ధార్చకుడు ఆ కఠినహృదయుని వైపు ఒకసారి కన్నీళ్ళు నిండిన కళ్లతో చూశాడు. ఆ వెంటనే దీన స్వరంతో జాలిగొలిపే వాక్యాలతో "మా భగవంతుని దివ్యమంగళ విగ్రహాన్ని మాకువదలివేసినట్లయితే మీకు కావలసినంత ధనం యిస్తాము. ఏమికా[illegible]లన్నా కోరుకోండి" అంటూ వే[illegible]సాగాడు.

ఈ కరుణాలాపాలను వింటూనే మహమ్మదు హేళనగా పెద్దపెట్టున విరగబడి నవ్వేశాడు. ఆ అపహాస తరంగాలు అర్చకుల హృదయాలను భయాందోళనలతో ఊపివేశాయి. చివరకు నవ్వు నిలిపివేసి కర్కశంగా "వీలులేదు. నేను విగ్రహ విక్రేతను కాను. విగ్రహ విధ్వంసిని" అన్నాడు.

మరుక్షణమే తనచేతిలోఉన్న ఇనుపఆయుధాన్నిఎత్తి విగ్రహాన్ని ఒకే ఒక దెబ్బతో రెండుగా పగులకొట్టివేశాడు. ఒక విఘడియకాలం నేలమీద ఎఱ్ఱని చారికలతో రక్తం ప్రవహించినట్లు కనబడింది. పూజారులు గ్రుడ్లు పెద్దవిచేసి నేలవంకకే చూశారు. కాని అది రక్తంకాదనీ, సోమనాథవిగ్రహంలో దాచబడిన అమూల్యమైనరత్నాలూ మాణిక్యాలూననీ గ్రహించటానికి వారికి ఎంతోసేపు పట్టలేదు.

తిరిగీ మహమ్మదు మరోసారిఆయుధాన్ని ఎత్తి ఒకే వేటుతో వృద్ధార్చకుని శిరస్సు ఛిన్నంచేసివేశాడు. ఈ హింసాకాండనంతా చూస్తూనే మిగిలిన అర్చకులంతా ప్రాణభీతితో ఎక్కడివారక్కడ సముద్రతీరానికి పారిపోయి నావలలో ఎక్కి సురక్షిత ప్రదేశాలకు వెళ్లిపోయారు.

ఏ రాజకోశాగారాలలోనూ లేనంతటి అపార సంపదను తనలో భద్రపరచుకొన్న శ్రీ సోమనాథుడు ఆ మహానిధి నిక్షేపాలన్నిటినీ మ్లేచ్ఛరాజుపరం చేసివేసి, ఆ దేవాలయంలో తన అవతారం చాలించి వృద్ధార్చకుని తనతో తీసుకొని కైలాసశిఖరాలకు నిష్క్రమించాడు.

యవన సైనికుల పొడుగైన ఆయుధాలు తగిలి దేవాలయ ఘంటికలన్నీ ఖంగుమంటూ మ్రోగి వారి దిగ్విజయాన్ని నలువైపులా చాటివేశాయి. ★


కుటుంబ నియంత్రణం
గర్భనిరోధానికి
స్త్రీలు సేవింపదగిన ఔషధము స్పెక్ టేబ్ లెట్స్ (రిజష్టర్డ్) గర్భమురాకుండేందుకు తేలికగానోటిలో వేసుకొని మింగే మందు 12 రోజులు మందు వాడిన యడల గర్భధారణ కాకుండా చేయును..
పూర్తికోర్సు ప్యాకెట్టు 24 మాత్రలు వెల రు 12/- వి.పి. అదనము
ప్రతిచోట దొరుకును
ఇండియాలోను, విదేశాలలోను ఈమందువాడినవారు అయాచితంగా అనేక యోగ్యతాపత్రము లను పంపియున్నారు...


SEENU & CO.,
28.K.TANDAVARAYA GRAMANI ST • MADRAS-21.
GRAMS: ORCAS, (ESTD 1946), PHONE 55357.
(ADVT. PERMITTED UNDER G.O. MS. NO.431 HEALTH)